సాక్షి నల్లగొండ

బుధవారం ၊ 18 ၊ డిసెంబర్ ၊ 2024



అక్రమ కట్టడాల కూల్చివేత

మిర్యాలగూడ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. - 8లో



నీటి విడుదలకు సన్నాహాలు

మూసీ ఆయకట్టులో యాసంగి పంటల సాగుకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. - 10లో



ధాన్యం రాకను అడ్డుకోవాలి

ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ధాన్యం రాకుండా అడ్డుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండండి

నల్లగొండ క్రైం: సైబర్ నేరాలు–డిజిటల్ అరెస్ట్ ఫెడెక్స్ కొరియర్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ నేరగాళ్లు మేము ముంబయి నార్కోటిక్స్ పోలీసులమని చెబుతూ మీ పేరు మీద పార్సిల్ బుక్ అయ్యిందని, అందులో డ్రగ్స్ ఉన్నాయని మీపై కేసు నమోదైందని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటన ఇటీవల నల్లగొండలో జరిగిందని తెలిపారు. ఒక బాధితురాలు తన బ్యాంకు ఖాతాలోంచి దాదాపు రూ.5 లక్షలు అపహరించారని నల్లగొండ టూ టౌన్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. బాధితులు తమకు అనుమానం వస్తే 1930కి ఫోన్ చేయాలని, నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు.

20న ఇంటర్వ్యూలు

నల్లగొండ: దుబాయ్‌లో బైక్ రైడర్స్, డెలివరీ బాయ్స్ కోసం తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ పాసై 21 నుంచి 38 సంవత్సరాల వయసు కలిగి బైక్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 9440050951 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో 2015–16 బ్యాచ్‌కు ముందు యూజీ థియరీ అండ్ ప్రాక్టికల్, ఎంబీఏ కోర్సులు చదివిన విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని నల్లగొండ రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ, ఎంబీఏ విద్యార్థులు 30వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. జనవరి 4వ తేదీలోపు రూ.500 అదనపు రుసుముతో ఫీజును చెల్లించవచ్చని తెలిపారు.

30 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

నల్లగొండ: ఈ నెల 30న టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ ఎ.అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన మహిళా అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉండి యోగ్యతా పత్రం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల మహిళా అభ్యర్థులు యోగ్యతా పత్రం, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్, 2 పాస్ ఫొటోలతో నల్లగొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో హాజరు కావాలని తెలిపారు. టైలరింగ్‌లో 30 సీట్లు ఉన్నాయని, శిక్షణ 45 రోజులు ఉంటుందని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ : 7660022517 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైతుల వివరాలు నమోదు చేయాలి



నాంపల్లిలో కాంటా వేసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నాంపల్లి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) వి.వెంకటేశ్వర్లు సూచించారు. నాంపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పలువు వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ సీఈఓ నితీష్, సిబ్బంది ఉన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.



మంగళవారం తెల్లవారుజామున నల్లగొండకు సైకిల్‌పై ఆకుకూరలు తీసుకొస్తున్న వృద్ధుడు

చలిలోనే జీవన సమరం

అర్ధరాత్రి నుంచే రోజువారీ పనుల్లో వివిధ వర్గాల ప్రజలు నిమగ్నం

- మున్సిపాలిటీల్లో రాత్రి నుంచే రోడ్లు శుభ్రం
- రక్షణ కవచాలు లేక తప్పని ఇబ్బందులు
- కూరగాయలను మార్కెట్లకు తీసుకొచ్చిన రైతులు
- నీలగిరి, మిర్యాలగూడ పట్టణాల్లో 'సాక్షి' విజిట్

మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరుగుతోంది. ఎముకలు కొరికే చలిలో సైతం వివిధ వర్గాల కార్మికులు తమ విధులు నిర్వర్తిస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లో మంగళవారం తెల్లవారుజామున సాక్షి విజిట్ చేసింది. చలి పంజా విసురుతున్న వేళ ఆయా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులు, టిఫిన్ బండ్ల వ్యాపారులతోపాటు ఇతర వర్గాల వారు చలికి వణికిపోతూనే తమ పనులు చేసుకుంటూ కనిపించారు.

- నల్లగొండ టూటౌన్, మిర్యాలగూడ టౌన్



నల్లగొండ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో మంగళవారం తెల్లవారుజామున కూరగాయల లోడ్ దించుతున్న కార్మికులు

నీలగిరి పట్టణంలో ఇలా..

- నీలగిరి ప్రజలను మూడు రోజులుగా చలి చంపేస్తోంది. ఈ పరిస్థితుల్లో అత్యవసర పనులైన పారిశుద్ధ్య పనులు, ప్రధాన రోడ్లు, వాణిజ్య వ్యాపార కూడళ్లను మున్సిపల్ కార్మికులు రాత్రి సమయంలోనే శుభ్రం చేస్తున్నారు.
- నీలగిరి పట్టణంలో సోమవారం రాత్రి 9 గంటలకు 30 మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరై మంగళవారం ఉదయం 5 గంటలకు వరకు పనిచేశారు.
- మర్రిగూడ జంక్షన్ దగ్గరి నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు, భాస్కర్ టాకీస్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు, ప్రకాశం బజార్, రాష్ట్రపతి రోడ్డు, రామగిరి రోడ్డులో కార్మికులు చలికి వణుకుతూ డ్రెస్ కోడ్‌లోనే రోడ్లను ఊడ్చి చెత్తను ఎత్తిపోశారు.
- మున్ముందు చలి పెరగనున్నందున మున్సిపల్ కార్మికులకు స్వెటర్లు, చేతి గ్లౌజులు, బూట్లు అందించాలని కార్మికులు అభిప్రాయ పడుతున్నారు.
- బిక్షాటన చేసే వారు, మతి స్థిమితం కోల్పోయి తిరిగే వారు రాత్రంతా రోడ్ల పక్కనే నిద్రిస్తున్నారు. కొందరు రోడ్ల పక్క, బస్టాండ్, రైల్వేస్టేషన్, దుకాణాల ముందు పడుకున్నారు.
- ఇతర ప్రాంతాలకు వెళ్లే కొందరు ప్రయాణికులు చలికి వణుకుతూ రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో కూర్చోగా మరికొందరు పడుకొని కనిపించారు.
- నీలగిరి పట్టణానికి పది నుంచి 25 కిలోమీటర్ల దూరం నుంచి రైతులు కూరగాయలు, ఆకుకూరలు తీసుకొస్తూ కనిపించారు. కొందరు ద్విచక్ర వాహనాల మీద, మరికొందరు ఆటోల ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారు.
- బీట్ మార్కెట్ సమీపంలోని రైతు బజార్, ప్రకాశం బజారు వద్ద ఉదయం 10 గంటల వరకు ఎక్కువగా రైతులే కూరగాయలు విక్రయించి తిరిగి తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు.



నల్లగొండలోని సావర్కర్ నగర్‌లో రాత్రిపూట ట్రాక్టర్‌లోకి చెత్త ఎత్తుతున్న మున్సిపల్ సిబ్బంది

- ఎంత చలి ఉన్నా వివిధ వృత్తుల కార్మికులు, ప్రజలు, రైతులు తమ రోజు వారి పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు.

స్వెటర్లు అందించాలి



రెండు, మూడు రోజుల నుంచి చలి ఎక్కువగా పెడుతుంది. ఎంత చలి ఉన్నా తాము విధులకు హాజరు కాక తప్పడంలేదు. ప్రభుత్వం కార్మికులు స్వెటర్లు, చేతి గ్లౌజులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– నాగుల అనుషమ్మ, మున్సిపల్ కార్మికురాలు, నల్లగొండ

జీతాలు పెంచి ఆదుకోవాలి



రోజూ రాత్రి వర్షం కురిసినా, చలి పెట్టినా తాము మాత్రం పనులు చేయాల్సిందే. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలి. గాలి వానకు, చలి, ఎండకు పనిచేసే తమకు జీతాలు పెంచి ఆదుకోవాలి.

– గోలి కమల, మున్సిపల్ కార్మికురాలు, నల్లగొండ

మిర్యాలగూడ పట్టణంలో..

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులుండగా పారిశుద్ధ్య కార్మికులు కాంట్రాక్టు కింద 278 మందిగా ఉండగా మరో 37 మంది పర్మినెంట్ ఉద్యోగులున్నారు.
- వీరు ఉదయం 4గంటల నుంచి 4: 45 గంటల వరకు విధులకు హాజరుకావాల్సిన ఉండగా అదే సమయంలోనే విధులకు వచ్చి ప్రధాన అంతర్గత రహదారుల్లో చెత్త తరలించడంతో పాటు రోడ్లన్నీ ఊడ్చారు.
- శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి మరీ కార్మికుల బయోమెట్రిక్‌ను పర్యవేక్షిస్తున్నారు.
- మున్సిపాలిటీలో చలి కోట్లు, మంకీ క్యాప్‌లు ఇవ్వకపోవడంతో చలిలోనే పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు.
- మహిళా పారిశుద్ధ్య కార్మికులు కాలకృత్యాలను తీర్చుకునేందుకు వసతులు లేవు.
- రాత్రి వేళల్లో విధులను నిర్వహించే కార్మికులకు మాత్రం ఉద్యోగ భద్రత లేకుండా పోయింది.
- పారిశుద్ధ్య కార్మికులకు చీపురు కట్టలు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో అట్టాలతో చెత్తను తొలగిస్తున్నారు.
- జవాన్లు పారిశుద్ధ్య కార్మికులకు హాజరు తీసుకుని కాలనీల వారిగా వీధులను కేటాయించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని చెబుతున్నారు.
- స్వచ్ఛత ఆటో కార్మికులు, ఎక్కువగా రద్దీ ఉండే ప్రాంతాల్లో చెత్తను సేకరించి రోడ్లను శుభ్రం చేశారు. అయితే ఎవరికి కూడా చేతులకు తొడుగులు, రక్షణ పరికరాలు లేవు. చాలా మంది కార్మికులు చలికి తట్టుకోలేక పనులకు వెళ్లే ముందు చలి కాచుకుంటున్నారు. మరికొందరు టీ తాగి విధులకు హాజరవుతున్నారు.

చలికి తట్టుకోలేకపోతున్నాం



30 ఏళ్లగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తున్నాను. మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగిపోవడంతో తెల్లవారుజామున విధులకు రావడానికి ఇబ్బందిగా ఉంది. చలిలో పనిచేస్తున్న కార్మికులకు స్వెట్టర్లు, మంకీ క్యాపులు ఇస్తే బాటుంటుంది.

– కొడేటి యశోద, మిర్యాలగూడ

మరికొన్ని ఫొటోలు 8లో



మిర్యాలగూడలో విధులకు వెళ్లే ముందు చలి కాచుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులు

మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో..)

తేది	కనిష్టం	గరిష్టం
15న	17.6	27.5
16న	16.0	27.0
17న	15.4	26.4

అర్ధరాత్రి తరువాత ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల నుంచి 13 డిగ్రీల కనిష్టానికి పడి పోతున్నాయి.



నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి రోడ్డు ఊడుస్తున్న మున్సిపల్ కార్మికులు



మిర్యాలగూడ మున్సిపాలిటీలో..



నల్లగొండ ఎన్జీ కళాశాల వద్ద సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న టిఫిన్ సెంటర్

పెన్షన్.. ఉద్యోగుల హక్కు

నల్లగొండ టూటౌన్: పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ప్రభుత్వ బిక్ష కాదని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయన పెన్షనర్స్ దినోత్సవం సభకు హాజరై మాట్లాడారు. 1982 డిసెంబర్ 17న పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమన్నారు. అనంతరం పెన్షనర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు పెన్షన్ సాధన యోధుడు డీఎస్. నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాం సుందర్, బాణాల పరిపూర్ణాచారి, టాప్రా పూర్వ కార్యదర్శి కె.సత్తిరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, కోశాధికారి ఎండీ.అబ్దుల్‌ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, యానాల కృష్ణారెడ్డి, కౌసల్య, భిక్షమయ్య, పులి కృష్ణమూర్తి, జి.భిక్షమయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

ఫ్లోరోసిస్ సర్వే పక్కాగా నిర్వహించాలి

- డీఎంహెచ్ఓ శ్రీనివాస్

మర్రిగూడ: మండల వ్యాప్తంగా గురువారం నుంచి ఇంటింటా ఫ్లోరోసిస్ సర్వేను పక్కాగా నిర్వహించి ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి జిల్లా కేంద్రానికి నివేదిక అందించాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మర్రిగూడ పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు ఫ్లోరోసిస్ సర్వేపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న మందులు, త్వరలో ప్రారంభించనున్న డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో అడిషన్ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, చందూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ కల్యాణ్‌చక్రవర్తి, పీఓడీడీటీ కృష్ణకుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, వైద్యులు శాలిని, దీపక్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న పాండురంగారావు

కనగల్: ప్రకృతిలో లభించే ఇంధన వనరులను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడంతోపాటు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ మర్రు పాండురంగారావు అన్నారు. ఇంధన వనరుల పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కనగల్ మండలం చిన్న మాదారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో పెట్రోలియం, బొగ్గు, గ్యాస్ వంటి ఇంధనాలు దొరకని పరిస్థితి ఉంటుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇళ్లు, పాఠశాలలపై సోలార్ ఎనర్జీ ప్లాంట్లనుఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా సోలార్ ఎనర్జీ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గీద రమేష్‌రెడ్డి, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, హిందూ రాణి, సరిత, మధుసూదన్, శశిరేఖ, నరేందర్‌రెడ్డి, ఉమామహేశ్వరి, వాసు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన బృందాలకు సహకరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు వచ్చే బృందాలకు అందుబాటులో ఉంటూ సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం ఆమె.. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సర్వే బృందాలకు ప్రస్తుతం ఉన్న ఇంటి వివరాలు ఫొటోతో సహా ఇవ్వాలని కోరారు. నూతనంగా ఇల్లు నిర్మించుకునేవారైతే స్థలం వివరాలను సమర్పించాలన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల యాప్‌లో పేర్లు ఉన్న దరఖాస్తుదారుల వివరాలను ముందే ఆయా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. గతంలో దరఖాస్తు చేయనివారు ఇప్పుడు ఎంపీడీఓ కార్యాలయాల్లో ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



కట్టంగూర్ : నిమ్మ గ్రేడింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తెల్లరేషన్‌కార్డు ఉంటే దరఖాస్తు చేసుకోండి

తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి మహాలక్ష్మి పథకం కింద రూ.500కే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ కావాలనుకునేవారు గతంలో దరఖాస్తు చేయని వారు మాత్రమే మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లోని ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు తోపాటు, ఎల్‌పీజీ వినియోగదారుని నంబరు, ఆధార్ కార్డు వివరాలు, జిరాక్స్, ఎల్‌పీజీ గుర్తింపు ధ్రువపత్రాలతో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కట్టంగూర్: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కట్టంగూర్ మండలం అయిటిపాముల జీపి పరిధి గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. కంపెనీలో ఆధునిక వ్యవసాయ పనిముట్లు, నిమ్మగ్రేడింగ్, నిమ్మ ఒరుగుల తయారీ యంత్రాన్ని, కోల్డ్ స్టోరేజీని పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు సంఘటితంగా ఏర్పడి వ్యవసాయ సాగులో సాంకేతికతను ఉపయోగించటం పట్ల రైతులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్‌పీఓకు ఆర్థిక సాయం అందించేందుకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంధ్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఏఓ గిరిప్రసాద్, ఐఆర్‌డీఎస్ ఎన్‌జీఓ వాడేపల్లి రమేష్, ఎఫ్‌పీఓ డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి వచ్చే ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ఆర్టీసీ నల్లగొండ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన యాదగిరీశుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్, గ్యారేజీలను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ రీజనల్ మేనేజర్ శివశంకర్‌తో కలిసి డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అంతకు ముందు రీజనల్ మేనేజర్ జానిరెడ్డిని డిపో మేనేజర్ శ్రీనివాస్, ఉద్యోగులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, జాకబ్, ముత్యాలు, నరసింహ పాల్గొన్నారు.



మొక్క నాటిన అనంతరం సిబ్బందితో ఆర్ఎం

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్–2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలను రెండో రోజైన మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్‌ముసాబ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఇందిర, విమల, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరత్నం, సురేందర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, విజయ్, నాగరాజు, షహీద్, కవిత తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

క్లుప్తంగా

యజ్ఞం నిర్వహణకు అనుమతి ఇవ్వాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామ కంఠం భూమి(అంగడి స్థలం)లో హనుమత్ గాయత్రీ యజ్ఞం నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆంజనేయ స్వాములు, నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి తరపున మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పజ్జూరు వెంకటరెడ్డి, నాయకులు కొరవి శంకర్, మెడబోయిన శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం.. పలువురిపై కేసు నమోదు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా మంగళవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 బృందాలు మండలంలోని 373 ఇళ్లను తనిఖీ చేయగా 22 మంది మీటరు లేకుండా విద్యుత్ వాడుతుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలను విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ ఫ్రాంక్లిన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీపీ డీఈ స్వామినాయక్, ఏడీఈ రామునాయక్, స్థానిక ఏఈ వాస శ్రీకాంత్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదురుగా గల ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 70 నుంచి 75 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్యంతో పాటు ఆహారం తీసుకోకపోవడంతో మృతిచెందినట్లు తెలుస్తుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712579973, 8712662803 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

బస్సు దిగుతూ జారిపడి మహిళకు గాయాలు

సూర్యాపేటటౌన్: ఆర్టీసీ బస్సు దిగుతుండగా మహిళ జారిపడడంతో గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బొల్లం స్వరాజ్యం మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు దిగుతుండగా అదుపుతప్పి కిందపడటంతో ఆమె చేయి టైరు కింద పడింది. దీంతో ఆమె చేయికి గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

• గజగజ వణికిస్తున్న చలిలో..



నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో అర్ధరాత్రి చలిలో రోడ్లు ఊడుస్తున్న మున్సిపల్ కార్మికులు



నల్లగొండలో తెల్లవారుజామున రోడ్డుపై వెళ్తున్న చిరు వ్యాపారులు



నల్లగొండ బస్టాండ్‌లో నిద్రిస్తున్న ప్రయాణికులు



మిర్యాలగూడ పట్టణంలో చలి మంట వేసుకున్న మహిళలు



నల్లగొండ పట్టణంలో ఉదయం చలి మంట వేసుకుంటున్న ప్రజలు



నల్లగొండ బస్టాండ్‌లో అర్ధరాత్రి డ్యూటీ దిగి వస్తున్న కండక్టర్

అధిక వడ్డీ ఆశ చూపి మోసం

- 128 మంది నుంచి రూ.8కోట్ల మేర అప్పు తీసుకున్న ఘనుడు
- బాధితులు గొడవ చేయడంతో మధ్యవర్తుల పేరిట పొలం రిజిస్ట్రేషన్



చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

చిలుకూరు: అధిక వడ్డీ ఆశ చూపి అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి అప్పు చెల్లించలేక తన పొలాన్ని మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే ఆ పొలం అమ్మగా వచ్చే డబ్బులు అప్పు తీర్చేందుకు సరిపోకపోగా.. ఆ పొలంలో తమకు వాటా ఉందని అతడి బంధువులు దున్నుకోవడంతో బాధితులు మంగళవారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. చిలుకూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన కిశోర్ కొంతకాలం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత వ్యాపారం చేయడంతో పాటు ఫైనాన్స్ బిజినెస్ చేశాడు. అతని దగ్గర ఉన్న డబ్బులకు తోడు తెలిసివాళ్ల దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకొని ఫైనాన్స్ నడిపించేవాడు. ప్రారంభంలో అందరికీ ధిక వడ్డీతో డబ్బులు మంచిగానే ఇచ్చాడు. దీంతో రామాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన ఆర్లెగూడెం, కోదాడలోనే కాకుండా అతని బంధువుల్లో కూడా ఇతడిపై నమ్మకం కలిగింది. అధిక వడ్డీ వస్తుండడంతో అతను ఎంత అడిగితే అన్ని డబ్బులు ఇవ్వడమే కాక, డబ్బులు ఉన్న వాళ్లు అతనికి పిలిచి మరీ ఇచ్చారు.

రూ.8 కోట్ల మేర అప్పు..

కిశోర్ రామాపురం, ఆర్లెగూడెం, కోదాడకు చెందిన వాళ్లు కాకుండా అతని బంధువులు మొత్తం 128 మంది నుంచి రూ.8 కోట్ల మేర అప్పు తీసుకున్నాడు. ఆరునెలల క్రితం అతడు ఐపీ పెడుతున్నట్లు గ్రామంలో పుకార్లు వచ్చాయి. దీంతో డబ్బులు ఇచ్చిన వాళ్లందరూ ఒక్కసారిగా డబ్బులు అడగడంతో అతడి వ్యవహారం మొత్తం బయటపడింది. ఒక్కొక్కరి వద్ద నుంచి కనిష్టంగా రూ.లక్ష, ఒకరి వద్ద నుంచి గరిష్టంగా రూ.80 లక్షల వరకు తీసుకున్నాడు. బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వమని గొడవ చేస్తుండడంతో గ్రామానికి చెందిన పెద్దమనుషులు అతడితో మాట్లాడి అతడి పేరు మీద ఆర్లెగూడెం శివారులో ఉన్న 6 ఎకరాల భూమిని అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని తీర్మానించారు. ఈ మేరకు 6 ఎకరాల భూమిని ఇద్దరు మధ్యవర్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అంతేకాక రామాపురంలోని 2 ఎకరాలు, మునగాల మండలం ఆకుపాముల వద్ద ఉన్న 2 ఎకరాలు భూమి మొత్తం సుమారుగా 10 ఎకరాలు భూమిని అమ్మి బాధితులకు డబ్బులు ఇవ్వాలని పంచాయితీ తీర్మానం చేశారు. కానీ ఇప్పటివరకు ఆ భూములు అమ్మలేదని, దీంతో తమ డబ్బులు తమకు వస్తాయా లేవా అని బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసులు స్పందించి పూర్తిస్థాయి విచారణ చేసి న్యాయం చేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల కూల్చివేత



జేసీబీతో అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు



తహసీల్దార్ హరిబాబుతో వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్

- తన సోదరి భూమిలో ఫెన్సింగ్ తొలగించడంతో తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన మున్సిపల్ చైర్మన్
- అది ప్రభుత్వ భూమి కావడంతోనే తొలగించామంటున్న అధికారులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ఫెన్సింగ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి వెంట సర్వే నంబర్ 626లోని ప్రభుత్వ భూమిని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవాని ఆక్రమించినట్లు గుర్తించిన రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాల మేరకు ఆ సర్వే నంబర్‌లో వేసిన ఫెన్సింగ్‌ను, ఇతర కట్టడాలను తొలగించారు.

ఆక్రమణకు గురైన సుమారు మూడు గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, తహసీల్దార్ హరిబాబు మధ్య వాగ్వాదం జరిగింది. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని తెలుస్తోంది. ఆ రహదారి వెంట తాపీ, సెంట్రింగ్, వడ్రంగి సంఘాలు నిర్మించిన గదిని జేసీబీ సహాయంతో తొలగించి 12గుంటల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపును సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ స్వయంగా పర్యవేక్షించారు. సుమారు నాలుగు గంటల పాటు అక్రమ కట్టడాల కూల్చివేతలు జరిగాయి.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే కూల్చివేశాం

అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై సర్వే నంబర్ 626లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు మా విచారణలో తేలింది. కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– హరిబాబు, తహసీల్దార్

నోటీసులు ఇవ్వకుండానే కూల్చేశారు

అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి వెంట నా సోదరి రాయపూడి భవాని 2012లో పట్టా భూమిని కొనుగోలు చేసింది. సర్వే నంబర్ 711లో 22 గుంటల భూమిని కొనుగోలు చేశాం. అప్పుడే ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి ప్రభుత్వ భూమి అని మేము వేసిన ఫెన్సింగ్‌ను కనీసం సమాచారం ఇవ్వకుండానే తొలగించారు. అధికారుల చర్యలు కక్ష సాధింపు చర్యలుగా ఉన్నాయి.

– తిరునగరు భార్గవ్, మున్సిపల్ చైర్మన్

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య



రాకేష్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మద్యం మత్తులో ఓ యువకుడు ఎలుకల నివారణ ట్యాబెట్లు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన కన్నెంకటి రాకేష్(24) గూడూరు గ్రామ శివారులోని ఆర్ఎస్‌పీ రైస్‌మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే రాకేష్ సోమవారం కూడా మిల్లుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. డ్యూటీకి వెళ్లిన కుమారుడు రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో అతడి తండ్రి కుమారస్వామి భయాందోళనకు గురై రాకేష్ మిత్రుడు నల్లమేకల శ్రీనివాస్‌తో కలిసి గాలిస్తుండగా మంగళవారం ఉదయం గూడూరు గ్రామ శివారులో ఖాళీ స్థలంలో రాకేష్ విగతజీవిగా ఉండటం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ పిల్ల లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. మృతదేహం వద్ద బీరు బాటిల్‌తో పాటు ఎలుకల నివారణకు ఉపయోగించే ట్యాబ్లెట్లు ఉండటం గమనించారు. రాకేష్ మిల్లుకు సరిగా వెళ్లడం లేదని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిరప పంటను ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



గడ్డి మందు పిచికారీ చేయడంతో వాడిపోయిన మిరప పంట

నాగారం: గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటపై గడ్డి మందు పిచికారీ చేసి ధ్వంసం చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి నాగారం మండల కేంద్రంలో జరిగింది. బాధిత రైతుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన రైతు బొబ్బలి కనకయ్య ఎకరం భూమిలో మిర్చి పంట సాగు చేశాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి పంటపై గడ్డి మందు పిచికారీ చేయడంతో పంట పూర్తిగా ధ్వంసమైంది. ఈ మిర్చి పంట విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. బాధిత రైతు మంగళవారం నాగారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం



బాలరాజు (ఫైల్)

రామన్నపేట: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన వనం బాలరాజు(38) చేనేత వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్నాడు. అతడికి భార్య రాజేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో కొద్దిరోజులుగా రాజేశ్వరి తన పిల్లలతో కలిసి అదే గ్రామంలో తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసైన బాలరాజు మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పాఠశాల నుండి వచ్చిన బాలరాజు పెద్ద కుమార్తె మధుబాల తండ్రి దూలానికి వేలాడుతుండటం చూసి ఏడ్చుకుంటూ తల్లి వద్దకు పరుగెత్తి విషయం చెప్పింది. ఆమె స్థానికులతో కలిసి ఇంటికి వెళ్లి చూడగా అప్పటికే బాలరాజు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

ఇసుక డంప్ సీజ్



ఇసుక డంప్ సీజ్ చేస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల: మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద ముత్యాలమ్మ బండలకు సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రక్కుల ఇసుకను తహసీల్దార్ అమీన్‌సింగ్ మంగళవారం పరిశీలించి సీజ్ చేశారు. పంచనామా చేసి ఇసుక డంప్‌ను పంచాయతీ కార్యదర్శి వెంకట్‌కి అప్పజెప్పినట్లు తెలిపారు. గ్రామస్తులు అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

అపహరించిన ఆటోతో పట్టుబడిన నిందితులు

వలిగొండ : ఆటోను అపహరించి అదే ఆటోలో తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం వలిగొండ మండలం నాగారం వై జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. నంబర్ ప్లేట్ లేని ఆటోలో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపగా.. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిని విచారించగా ఆటోను దొంగతనం చేసిన పక్క రాష్ట్రంలో అమ్మేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పఠాన్‌చెర్వు కుమ్మరిబస్తీకి చెందిన చెన్న సత్యనారాయణ, చెన్న సురేష్‌గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరు 8వ తేదీన భువనగిరిలో ఆటోను కిరాయికి మాట్లాడుకొని వేములకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వలిగొండ–భువనగిరి మార్గంలో ఆటో డ్రైవర్‌కు మద్యం తాగించి అతడిని బెదిరించి ఆటోను దొంగిలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



గోదాదేవికి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి రెండో పాశురాన్ని పఠించారు. అమ్మవారికి మహిళా భక్తులు మంగళహారుతులతో నీరాజనాలు పాడారు. ధనుర్మాసంలో గోదాదేవికి జరిపించే విశేష పూజలు, పాశురాలకు సంబంధించిన విశిష్టతను ప్రధానార్చకులు భక్తులకు వివరించారు.

యువకుడి అదృశ్యం

- కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబ సభ్యులకు వీడియో కాల్



శంకర్

మిర్యాలగూడ: తనకు కారు కొనివ్వకపోతే కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఓ యువకుడు కుటుంబ సభ్యులకు వీడియోల్ కాల్ చేసి అదృశ్యమయ్యాడు. వాడపల్లి ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన రమావత్ శంకర్(25) సెల్ టవర్ల నిర్మాణ సంస్థలో కూలీ పనికి వెళ్తుంటాడు. శంకర్ తనకు బైక్‌ను కొనివ్వాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడంతో ఆరు నెలల క్రితం అతడికి బైక్ కొనిచ్చారు. ఇటీవల తనకు కారు కావాలంటూ తల్లిదండ్రులను అడగగా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదని నచ్చజెప్పారు. అయినా వినకుండా రెండు రోజుల క్రితం తనకు కారు కొనివ్వకపోతే చనిపోతానంటూ శంకర్ తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దామరచర్ల శివారులో శంకర్‌ను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరిగి మంగళవారం శంకర్ దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా నదిలో దూకి తాను చనిపోతున్నానంటూ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేయడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు కృష్ణానది వద్దకు చేరుకోగా.. వాడపల్లి బ్రిడ్జి పక్కన శంకర్ చెప్పులు, సెల్‌ఫోన్ గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని నదిలో దూకి ఉండవచ్చనే అనుమానంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు: మండలంలోని తానేదార్‌పల్లి, జూనూతుల గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు. బోలగాని అంజనేయులు అనే వ్యక్తి వద్ద నుంచి 38 బస్తాల(19 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని కొత్ర నాగరాజు అనే వ్యక్తి తన ఆటోలో వేసుకుని వెళ్తుండగా జూనూతుల సమీపంలో పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నాగరాజు ఇచ్చిన సమాచారం మేరకు తానేదార్‌పల్లిలో పాంపాటి అశోక్ వద్ద 10 బస్తాలు, గార్లపాటి వెంకటేశ్వర్లు వద్ద 10 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూదాన్‌పోచంపల్లిలో 20 క్వింటాళ్లు...

భూదాన్‌పోచంపల్లి: మినీ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం రామలింగంపల్లి గ్రామానికి చెందిన రామావత్ సురేష్ రేషన్ లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం రాత్రి అలీనగర్ సమీపంలో పట్టుకున్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

కట్టంగూర్: మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని(షాప్ నంబర్: 2323025) మంగళవారం నకిరేకల్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాచకొండ జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 69 కిలోల రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇతరులకు విక్రయించినట్లు తేలడంతో డీలర్ ఎం. శివకుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.